ముగిసిన 'పది' పరీక్షలు

చందూర్‌లో పరీక్ష రాసిన అనంతరం బయటికి వస్తున్న విద్యార్థులు

ఖలీల్‌వాడి, మార్చి 30 : జిల్లావ్యాప్తంగా పది పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించినందుకు సిబ్బందిని అభినందించారు. చివరి పరీక్షకు జిల్లావ్యాప్తంగా 21,908 మంది విద్యార్థులకు 21,869 మంది హాజరైనట్లు తెలిపారు. పలు పరీక్షా కేంద్రాలను ప్రత్యేక అధికారులు, స్క్వాడ్‌లు తనిఖీ చేశారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. హాస్టళ్లలోని విద్యార్థులు సామగ్రితో ఇండ్లకు తరలివెళ్లారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

ప్రదర్శనను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

ఖలీల్‌వాడి, మార్చి 30 : నగరంలోని శ్రీరామగార్డెన్‌లో కాకతీయ ఒలంపియాడ్ పాఠశాలకు చెందిన విద్యార్థులకు చట్టానికి రోబో పేస్ట్ పేరుతో వివిధ ప్రదర్శనల కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. 6 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులు 378 వివిధ ప్రయోగాత్మక ప్రదర్శనలు చేయగా.. ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రజనీకాంత్, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, వైస్‌ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కథా సదస్సులో పాల్గొన్న గుండారం విద్యార్థులు

సారంగాపూర్, మార్చి 30 : కెనడా దేశం కేంద్రంగా తెలుగుతల్లి, గడుగ్గాయి పత్రికల సౌజన్యంతో నిర్వహించిన 'ఊ కొడతారా బుజ్జాయిల కథలు' శీర్షికతో అంతర్జాతీయ స్థాయిలో జూం మీటింగ్ ద్వారా నిర్వహించిన కథాసదస్సులో గుండారం విద్యార్థులు పాల్గొన్నారు. శనివారం సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు సదస్సు నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా 10 దేశాలు, 150 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో గుండారం ఉన్నత పాఠశాల విద్యార్థులు లాస్య, కృష్ణవేణి, ఇందు, శ్రీవేణి, మధుమీనాక్షి, సాయిహర్షిత, నిహారిక, శృతిరెడ్డి, స్పందన, సంజన, అశ్విని పలు కథలను వినిపించారు. విద్యార్థులను కెనడాలోని నిర్వాహకులు రాయవరపు లక్ష్మి, ఉదయశ్రీ అభినందించారు. సదస్సుకు విద్యార్థులను సిద్ధం చేసిన ఉపాధ్యాయులు కాసర్ల నరేశ్‌రావు, వారె దస్తగిరి, శ్రీపాద్‌ను హెచ్ఎం అమర్‌నాథ్ అభినందించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

బోధన్ రూరల్, మార్చి 30: పంచాయతీ కార్మికులు, ఉద్యోగుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం సాలూర మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం ఎదుట ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేపట్టారు. ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బండారు మల్లేశ్ మాట్లాడుతూ సాలూరా మండలంలోని సాలూరా, తగ్గెల్లి, ఖాజాపూర్, హున్సా, మంథర్న తదితర గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమ్మెకాలం వేతనాలు కూడా అందించాలని కోరారు. ధర్నా అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో వి.శంకర్, కె.గంగాధర్, సతీశ్, ఎస్.రాములు, రాహుల్, సాయిలు, శంకర్, లక్ష్మీబాయి, సక్కుబాయి, సావిత్రి, గంగవ్వ, గోదావరి తదితరులు ఉన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ర్యాలీ

ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

మోర్తాడ్, మార్చి30: ఎన్ఎస్ఎస్ వేసవికాల శిబిరంలో భాగంగా శనివారం మండల కేంద్రంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. మోర్తాడ్ బస్టాండ్ నుంచి జాతీయరహదారి పాలెం రోడ్డు వరకు, ఎస్సీ, బీసీ కాలనీల్లో ర్యాలీ కొనసాగింది. ఇంటింటికీ మొక్కలు నాటాలని, ఎయిడ్స్‌తో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, బాలికలను చదివించాలని సూచించారు. ప్లాస్టిక్‌ను తరిమికొడదాం అని నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం బస్టాండ్ ప్రాంతంలో ప్రయాణీకుల చలివేంద్రం వద్ద తాగునీటిని అందించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి భూపతి పాల్గొన్నారు.

ఎన్నికల ప్రలోభాలపై గట్టి నిఘా

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, మార్చి 30 : ఎన్నికల ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, ప్రలోభాలకు అవకాశం లేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అధికారులు గట్టి నిఘా ఏర్పాటు చేసి, అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా ఇంటలిజెన్స్ కమిటీ సమావేశాన్ని సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ కిరణ్మయి, సహాయ రిటర్నింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల వ్యయ నియంత్రణ ప్రధాన అంశమని, ఖర్చును పక్కాగా లెక్కించాలని అన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే డబ్బు, మద్యం, కానుకలు, మత్తు పదార్థాలు తదితర వాటిపై గట్టి నిఘా ఉంచాలని సూచించారు. బ్యాంకు లావాదేవీలపై దృష్టి సారించాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావుకు సూచించారు. ఆర్టీసీ బస్సులు, కార్గో, రైళ్ల ద్వారా ఎన్నికల్లో భాగంగా వస్తువులను సరఫరా చేస్తే సమాచారం అందించాలని ఆర్టీసీ, రైల్వే అధికారులను ఆదేశించారు. సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి తనిఖీలు చేపడుతూ పలు చోట్ల నగదుతో పాటు మద్యాన్ని పట్టుకున్నామని తెలిపారు.

ఈవీఎంల కేటాయింపు..

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరుపై ప్రయోగాత్మకంగా శిక్షణ అందించేందుకు ఈవీఎంలను శనివారం కేటాయించారు. జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్ నుంచి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ పర్యవేక్షణలో గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధుల సమక్షంలో, భద్రతా ఏర్పాట్ల మధ్య ఈవీఎంను కేటాయింపు ప్రక్రియ నిర్వహించారు. కార్యక్రమంలో బోధన్ ఆర్డీవో రమేశ్ రాథోడ్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, సంతోష్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

రుద్రూర్/ వర్ని/ సిరికొండ/ మార్చి 30 : రుద్రూర్ మండలం రాయకూర్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ వెంకటేశం శనివారం ప్రారంభించారు. ఏ -గ్రేడ్ రకానికి రూ.2,203, బీ -గ్రేడ్ రకానికి 2,183 మద్దతు ధర ప్రకటించినట్లు పేర్కొన్నారు. వర్నిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కార్యాలయ ఆవరణలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా సహకార ఆడిట్ అధికారి పాపయ్య ప్రారంభించారు. నెహ్రూనగర్, సత్యనారాయణపురం, శ్రీనగర్ గ్రామాల్లో అధికారులు కేంద్రాలను ప్రారంభించారు. సిరికొండ మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీడీ సాయాగౌడ్ ప్రారంభించారు.

రాయకూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ వెంకటేశం

అభివృద్ధి పథంలో ఐడీసీఎంఎస్

సమావేశంలో మాట్లాడుతున్న ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్

ఖలీల్‌వాడి, మార్చి 30 : ఐడీసీఎంఎస్ 55వ మహాజన సభను సొసైటీ అధ్యక్షుడు సాంబారి మోహన్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐడీసీఎంఎస్ అభివృద్ధి పథంలో నడుస్తున్నదన్నారు. సొసైటీకి సంబంధించిన ఆదాయ వ్యయాలను చదివి వినిపించారు. చైర్మన్ కుంట రమేశ్‌ను పాలకవర్గ సభ్యులు సన్మానించారు. రైతులకు బీమా సౌకర్యాన్ని రూ. లక్ష నుంచి రూ. 2 లక్షలకు పెంచినందుకు చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అసైన్డ్ భూములకు కూడా రుణం ఇవ్వాలని, ప్రైవేట్ బ్యాంకులకు దీటుగా ఎకరానికి రూ. 50 వేల చొప్పున రుణం మంజూరు చేయాలని నిర్ణయించారు. ఐడీసీఎంఎస్ వైస్‌చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, సాయన్న, తారచంద్‌నాయక్, శ్రీనివాస్‌గౌడ్, నల్లవెల్లి కపిల్‌రెడ్డి, రాజేశ్వర్, మధునాల రాజాగౌడ్, గోపాల్, చైర్మన్లు, నగేశ్ పాల్గొన్నారు.

రూ.2లక్షల రుణమాఫీ అమలు చేయాలని తీర్మానం

సారంగాపూర్/ మాక్లూర్/ బోధన్ రూరల్, మార్చి 30 : ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన హామీని వెంటనే అమలు చేయాలని గుండారం సొసైటీ చైర్మన్ దాసరి శ్రీధర్ అధ్యక్షతన జరిగిన విండో మహాజన సభలో సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను కూడా వెంటనే ప్రారంభించి ఎరువులు, విత్తనాలు సకాలంలో అందేలా చూడాలని కోరారు. సొసైటీ సీఈవో అనంతలక్ష్మీ కార్యకలాపాల నివేదికను చదివి వినిపించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మణ్‌రావు, వీడీసీ చైర్మన్ సాయికుమార్, క్యాషియర్ పోతన్న, సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

మాక్లూర్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం 83వ మహాజన సభను చైర్మన్ అశోక్ అధ్యక్షతన నిర్వహించారు. సంఘ కార్యదర్శి సంతోష్.. ఆదాయవ్యయాలను రైతుల సమక్షంలో చదివి వినిపించారు. త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, సొసైటీలో అవినీతి జరుగుకుండా చూస్తానని చైర్మన్ అశోక్ అన్నారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్లు లింగారావు, పోశెట్టి, డైరెక్టర్లు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

బోధన్ మండలం సాలూరాలోని సింగిల్‌విండో కార్యాలయంలో సంఘ అధ్యక్షుడు అల్లె జనార్దన్ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. సంఘ కార్యదర్శి బస్వంత్‌రావు పటేల్ వార్షిక ఆదాయ, వ్యయాలను చదివి వినిపించారు. పొద్దుతిరుగుడు పంట కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేయాలని సభ్యులు తీర్మానం చేశారు.

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ముంజల కోసం తాటి చెట్టు పైకెక్కి యువకుడి మృతి

ఎడపల్లి, మార్చి 30: మండలంలోని కుర్నాపల్లి గ్రామంలో శనివారం తాటి చెట్టుపై నుంచి పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ మక్కల రాజశేఖర్ (33) తాటి ముంజల కోసం మధ్యాహ్నం 12 గంటలకు తాటి చెట్టు ఎక్కాడు. ముంజలు తెంపుతున్న క్రమంలో జారి కింద పడి మృతి చెందాడు. మృతుడి భార్య రాజ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు వైష్ణవ ఆత్మీయ సమ్మేళనం

సుభాష్‌నగర్, మార్చి 30 : గాజుల్‌పేట్‌లోని ఎంజీ ఫంక్షన్ హాలులో నేడు (ఆదివారం) ఉదయం 11 గంటలకు నిర్మల్, ఆదిలాబాద్, కామారెడ్డి, నిజామాబాద్ శ్రీవైష్ణవ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయనున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి కాందాళై ఆచార్య నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

కేంద్రప్రభుత్వానికి కృతజ్ఞతలు

సుభాష్‌నగర్, మార్చి 30 : దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించి, పీవీ వారసుడు ప్రభాకర్‌రావుకు అవార్డును అందజేయడంపై తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం, తెలంగాణ గాయత్రి ధార్మిక సేవా సమాఖ్య, అఖిల భారతీయ భగవద్గీత కేంద్ర ప్రచార మండలి, పద్యభారతి తదితర సంస్థలు సంతోషం వ్యక్తం చేశాయి. ఆర్యనగర్ బ్రాహ్మణ సంక్షేమ సంఘ కార్యాలయంలో శనివారం సమావేశం ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

కత్తెర పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలి

ఆలూర్‌లో సజ్జ పంటను పరిశీలిస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు

బాల్కొండ/ముప్కాల్/ఆర్మూర్‌టౌన్, మార్చి 30: బాల్కొండ మండలంలో కత్తెర పురుగు సోకిన సజ్జ పంట పొలాలను వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు శనివారం పరిశీలించారు. కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ శాస్త్రవేత్త విజయ్ మాట్లాడారు. సజ్జ పంటలో కత్తెర పురుగు ఉధృతి అధికంగా ఉన్నట్లు గమనించినట్లు తెలిపారు. దీని నివారణకు మందులు పిచికారీ చేసుకోవాలని వ్యవసాయాధికారి మహేందర్‌రెడ్డి సూచించారు. ముప్కాల్ మండలంలోని రెంజర్ల గ్రామంలో కత్తెర పురుగు, మొగి పురుగు సోకిన సజ్జ పంటలను భీంగల్ ఏడీఏ మల్లయ్య స్థానిక మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం సజ్జ పంటలో కత్తెర పురుగు ఉధృతి అధికంగా ఉన్నందున నివారించుకోడానికి సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలన్నారు. ముఖ్యంగా పంటలో పురుగును గమనించిన తొలి దశలోనే వేప నూనె 5 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. రెక్కల పురుగులను సైతం నిర్మూలించేందుకు ఎకరానికి 10 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. పంట కోసిన తర్వాత దుక్కులు దున్నితే పురుగరు ఉధృతిని తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈవో నిషికాంత్, రైతులు పాల్గొన్నారు. ఆలూర్ మండల కేంద్రంలో సజ్జ పంటను కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ రైతులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ విజయలక్ష్మి, ఏవో హరికృష్ణ, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

నిన్న నాచుతో.. నేడు శుభ్రంగా..

శుభ్రంగా ఉన్న ట్యాంకు

కోటగిరి, మార్చి 30 : పొతంగల్ మండలకేంద్రంలోని వారసంతలో ఉన్న వాటర్‌ట్యాంకు మొత్తం నాచుతో అపరిశుభ్రంగా ఉండడంతో 'నమస్తే తెలంగాణ దినపత్రిక'లో 'ట్యాంకు ఇలా.. నీరు తాగేదేలా' శీర్షికతో శనివారం వార్త ప్రచురితమైంది. సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏఈ ధన్‌రాజ్, పొతంగల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి చంద్రకాంత్ వాటర్ ట్యాంకుకు పేరుకుపోయిన నాచుతో పాటు పరిసరాల్లో ఉన్న మురికిని శుభ్రం చేయించారు. ట్యాంకుతో పాటు పరిసరాలను శుభ్రం చేయడంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

'బార్' నూతన కార్యవర్గానికి అభినందన

జిల్లా ప్రధానన్యాయమూరి కుంచాల సునీతతో బార్ నూతన కార్యవర్గం

వినాయక్‌నగర్, మార్చి 30 : నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలుపొందిన నూతన కార్యవర్గం జిల్లా ప్రధాన న్యాయమూరి కుంచాల సునీతతోపాటు న్యాయమూర్తులు కనకదుర్గ, శ్రీనివాస్, చిరంజీవి, ఆశలత, శ్రీకాంత్ బాబు, శ్రీనివాసరావును శనివారం కలిసింది. అధ్యక్షుడు జగన్ మోహన్ గౌడ్, ప్రధానకార్యదర్శి వసంత్‌రావు, ఉపాధ్యక్షుడు పి.రాజు, కోశాధికారి దీపక్, స్పోర్ట్స్ సెక్రటరీ అయ్యూబ్, లైబ్రరీ సెక్రటరీ పిల్లి శ్రీకాంత్, మహిళా ప్రతినిధి కవితా రెడ్డి, కార్యవర్గ సభ్యులు చక్రవర్తి, శివాజీ, డి.రవి, లక్ష్మీనారాయణ, ఆరెట్టి నారాయణ, రజితను న్యాయమూర్తులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షిప్తంగా..

● **చలివేంద్రాలు ప్రారంభం-** కోటగిరి/ మోస్రా (చందూర్), మార్చి 30 : కోటగిరి మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా.. గ్రామపెద్ద ఉమాకాంత్‌దేశాయ్ శనివారం ప్రారంభించారు. చందూర్ మండల కేంద్రంలో శ్రీ విఘ్నేశ్వర కాలనీ వాసులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని వారు తెలిపారు.

● **ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి -** సారంగాపూర్, మార్చి 30 : ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. నగర శివారులోని ఖానాపూర్ విఠలేశ్వర్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన, గోపురం ఏర్పాటు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పూజలు చేశారు. ఎమ్మెల్యేను కాలనీ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.

● **ఉపాధిహామీ కూలీల సంఖ్యను పెంచాలి -** ధర్పల్లి, మార్చి 30 : ఉపాధిహామీ కూలీల సంఖ్యను పెంచాలని, గ్రామంలో కనీసం 150 మంది కూలీలు పని చేసేలా చూడాలని డీఆర్డీవో సాయాగౌడ్ అన్నారు. మండలంలోని హోన్నాజీపేట్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలును ప్రారంభించిన అనంతరం గ్రామ పరిధిలో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో బాలకృష్ణ, మాజీ సర్పంచ్ భగవంత్ రెడ్డి, ఏపీవో వినోద, ఉపాధి కూలీలు ఉన్నారు.

● **తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు -** ధర్పల్లి, మార్చి 30 : ఎండలు తీవ్రమైనందున గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో బాలకృష్ణ తెలిపారు. మండలంలోని ధనంబండ తండా, చింతరాళ్ల తండాలో ఆయన శనివారం పర్యటించారు. డీబీ తండాలో లీకేజీ సమస్యలు వెంటనే పరిష్కరించగా, చింతరాళ్ల తండాలో సమస్యను పరిష్కరిస్తామన్నారు.

● **నర్సరీ పరిశీలన-** జక్రాన్‌పల్లి, మార్చి 30 : మండలంలోని కలిగోట్‌లో ఉన్న నర్సరీని ఎంపీడీవో సతీశ్ కుమార్ శనివారం పరిశీలించారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున మొక్కలు ఎండిపోకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి జయంత్, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

● **పరీక్ష అట్టల పంపిణీ** – రుద్రూర్, మార్చి 30 : మండలంలోని రాయకూర్ ప్రభుత్వ పాఠశాలలో 6,7,8 తరగతి విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఆఫ్ రుద్రూర్ ఆధ్వర్యంలో పరీక్ష అట్టలు, పెన్నులు, బిస్కెట్ ప్యాకెట్లను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు శ్యామ్‌సుందర్ పహాడే, హెచ్ఎం ప్రకాశ్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు శ్యామ్‌సుందర్, కార్యదర్శి ప్రవీణ్, కోశాధికారి కేవీ మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **ఫీజును పెంచడం సరికాదు** – డిచ్‌పల్లి, మార్చి 30 : టీయూ పరిధిలో కాన్వొకేషన్ ఫీజును రూ. 700 నుంచి ఏకంగా రూ.3500కు పెంచడం దుర్మార్గమని యూనివర్సిటీ పీడీఎస్‌యూ కార్యదర్శి జయంతి అన్నారు. యూనివర్సిటీ ఎదుట శనివారం నిరసన వ్యక్తం చేసిన అనంతరం ఆమె మాట్లాడారు. వీసీ ఇష్టం వచ్చినట్లు కాన్వొకేషన్ ఫీజులు పెంచడం అన్యాయమన్నారు. పెంచిన ఫీజులను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. పెంచిన ఫీజులను తగ్గించాలని కోరుతూ గిరిజన శక్తి అధ్యక్షుడు శ్రీనూనాయక్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ ఆరతికి వినతిపత్రం అందజేశారు.

● **ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు** – డిచ్‌పల్లి, మార్చి 30 : టీయూలో ఎన్ఎస్‌యూఐ 53వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా క్విజ్ పోటీలను నిర్వహించారు. ఎన్ఎస్‌యుఐ యూనివర్సిటీ కమిటీ అధ్యక్షుడు శ్రీశైలం ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగింది.

● **కొనసాగుతున్న బీపీఎడ్ పరీక్షలు-** డిచ్‌పల్లి, మార్చి 30 : టీయూ పరిధిలో బీపీఎడ్ 1, 3వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. నాలుగో రోజు శనివారం ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెంటర్‌లో నిర్వహించిన పరీక్షకు 81 మంది విద్యార్థులకు 77 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ గంటా చంద్రశేఖర్ తెలిపారు.

● **మున్సిపల్ చైర్‌పర్సన్‌కు సన్మానం-** ఆర్మూర్‌టౌన్, మార్చి30: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నూతన మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యను శనివారం బీజేపీ కౌన్సిలర్లు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆకుల శీను తదితరులు పాల్గొన్నారు.

● **ఇసుక ట్రాక్టర్‌కు జరిమానా-** రెంజల్, మార్చి 30: మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుబడిన ట్రాక్టర్‌కు జరిమానా విధించినట్లు తహసీల్దార్ ఎంఏ ఖలీం శనివారం తెలిపారు. ఈనెల 28న నీలా గ్రామ శివారులో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా రెంజల్ పోలీసులు పట్టుకొని సీజ్ చేశారని పేర్కొన్నారు. ట్రాక్టర్‌కు రూ.5వేల జరిమానా విధించి, ఇసుకను కార్యాలయం వద్ద నిల్వ చేసినట్లు తెలిపారు.

● **నిబంధనలు పాటించాలి -** నవీపేట, మార్చి 30: నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై తిరిగే వాహనాలను సీజ్ చేస్తామని నిజామాబాద్ ఆర్టీఏ పండరి రంగరాజ్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో పలు వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలకు ఫిట్‌నెస్‌తో పాటు ఇన్సూరెన్స్ పత్రాలు ఉండాలని అన్నారు. సరైన పత్రాలు లేకుండానే ఆటోలు ప్రయాణికులకు తీసుకెళ్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నట్లు చెప్పారు.

రోడ్లపై ధాన్యం ఆరబోయొద్దు

■ రైతులకు ఎస్సై సూచన

కమ్మర్‌పల్లి, మార్చి 30: రోడ్లపై ధాన్యం ఆరబోయవద్దని ఎస్సై రాజశేఖర్ కోరారు. రోడ్లపై ధాన్యం ఆరబోయడం వల్ల కలిగే నష్టాలను శనివారం మండలంలోని నర్సాపూర్‌లో గ్రామస్తులు, రైతులకు ఎస్సై వివరించారు. రోడ్లపై ధాన్యం ఆరబోయడంతో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటూ ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని గుర్తు చేశారు. ఈ విషయంలో సహకరించి ప్రమాదాలు జరగకుండా బాధ్యతగా ఆలోచించాలని సూచించారు.

ఉద్యోగ విరమణ చేసిన పోలీసు సిబ్బందికి వీడ్కోలు

వినాయక్‌నగర్, మార్చి 30 : నిజామాబాద్ పోలీస్ శాఖలో విధులు నిర్వర్తించి నేడు ఉద్యోగ విరమణ చేయనున్న పలువురు సిబ్బందికి సీపీ కల్మేశ్వర్ సమక్షంలో వీడ్కోలు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కమిషనరేట్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా కొనసాగిన దోమోవార్ గోవింద్, పీసీఆర్ ఎస్సై శ్యామ్‌సుందర్ రావు, ఆరో టౌన్ ఎస్సై గణేశ్ ఉద్యోగ విరమణ చేయడంతో వారిని సీపీ శాలువలతో సత్కరించి, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, ఆఫీస్ సూపరింటెండెంట్ శంకర్, పోలీస్ సంఘం అధ్యక్షుడు షకీల్ పాషా తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందికి వీడ్కోలు పలుకుతున్న సీపీ కల్మేశ్వర్

ఆంగ్ల భాషపై అవగాహన

ధర్పల్లి, మార్చి30 : మండల కేంద్రంలోని లిటిల్ హార్ట్స్ పాఠశాలలో విద్యార్థులకు ఆంగ్ల భాషపై శనివారం అవగాహన కల్పించారు. కరస్పాండెంట్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఇంగ్లిష్ అంటే భయం కారణంగానే నైపుణ్యత సాధించలేకపోతున్నామని, అర్థం చేసుకుంటే ఆంగ్ల భాష పరిజ్ఞానం పెంపొందించుకోవడం ఎంతో సులభమని అన్నారు. విద్యార్థులు పాటలు, నాటికలు, నృత్య ప్రదర్శనల ద్వారా ఇంగ్లిష్ సబ్జెక్టుపై అవగాహన కల్పించారు. హెచ్ఎం సాధన, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు